# ఆంతర్యం

శేఖరం వద్దనుంచి వచ్చిన ఉత్తరాన్ని మరొకసారి చదివాడు రంగనాథం. ఆ ఉత్తరం చదువుతూవుంటే తనకు తెలియకుండానే అప్రయత్నంగా రెండు కన్నీటి బొట్లు రాలాయి.

"పూజ్యులైన తండ్రిగారికి—

నమస్కారములు.

ప్రస్తుతం సరిహద్దుల్లో గస్తీమీద వున్నాను. రెండు రోజుల్లో రిలీఫ్ అవుతాను. తరువాత నెల రోజులు శెలవుపెట్టి ఇంటికి వస్తున్నాను. ఇక్కడ మా పరిస్థితులు కూడా వేరే వ్రాయనక్కర లేదనుకుంటాను. కష్టాలకోర్చి మన దేశరక్షణకు పూనుకోవాలి. మీరు వ్రాస్తున్న ఉత్తరాలన్నీ అందుతున్నాయి. నా గురించి భయపడవద్దు. భారతమాత ఆశీర్వాదమే నాకు, ఇక్కడ ప్రాణాలొడ్డి పోరాడే నా సోదరులకు రక్ష. మీరు వ్రాసిన ప్రకారం 8 వ తారీఖున బయలుదేరి రావటానికే ప్రయత్నిస్తాను. జైహింద్!

మీ శేఖరం.

పైమీద కండువాతో కళ్ళు నీళ్ళొత్తుకున్నాడు! తన

మనస్థితి గనకే ఆశ్చర్యం అనిపించింది. శేఖరం వాడి మంచి తనంతో తన మనస్సును బంధించాడు.

ఎంతకక్ష పెంచుకుందా మనుకున్నా లొంగిపోయింది. మనస్సు.

“శేఖరం ఎవరు?” ఈ ప్రశ్న వేసుకుంటె గుండెలు దడదడ మంటాయి.

తనకు శత్రువు!... ...

కాని తనవద్ద ఇరవై రెండేళ్లు పెరిగాడు!

తనకు ఆప్యాయంగా, ప్రాణంకంటె ఎక్కువగా చూసుకు నేవ్యక్తిగా తయారయ్యాడు!

తన పుత్రుడు... ...

అంటే తనను నరకం నుండి రక్షించేవాడు!

కాని తనకు నరకం సృష్టించేవాడయ్యాడు!

మరచిపోదామనుకున్నా మరువలేని గతం శేఖరాన్ని శత్రువుగా రూపొందిస్తోంది.

... ... ... ... ... ... ...

రంగనాథం స్కూలు ఫైనల్ వరకూ చదువుకున్నాడు. తండ్రి ప్రోద్బలంతో వ్యవసాయంలో తల దూర్చాడు. ఇరవై ఎకరాల సుక్షేత్రమైన మాగాణీ పొలం వ్యవహారాలన్నీ జాగ్రత్తగా చూసుకోవటం వలన తండ్రికి కొంత శ్రమ తగ్గించాడు. చక్కని చుక్కలాంటి పిల్లను పెళ్ళి చేసుకున్నాడు. ఇంట్లో తమ తండ్రి, తన భార్య సుఖంగా కాలం

గడిచి పోయేది! తల్లి తనను ఈ లోకంలో వదిలి వెంటనే ప్రాణం విడిచింది. అప్పటినుంచీ తండ్రే సర్వస్వం అయ్యాడు విధవమేనత్త సహాయంతో ఎంతో గారాబంగా పెరిగాడు. ఏ కష్టమూ పడకుండా పెంచాడు తండ్రి, చిన్నతనంలో గారాబం వలన ఆకతాయిగా పెరిగినా, అవసరం వచ్చినపుడు కొడుకు ఆదుకున్నందుకు తండ్రి ప్రాణం ఎంతో సంతోషించింది. ఆయన సుఖంగా విశ్రాంతి తీసుకొంటున్నాడు.

రంగనాథం పొలాన్ని ఆనుకొనే వుంది రాఘవయ్య పొలం! రాఘవయ్య పెద్ద మోతుబరి. కొంచెం చదువుకున్న వాడే! కాని సంస్కారంలేని వ్యక్తి! ఎంత దుర్మార్గానికైనా తెగించి సాహసించే వ్యక్తి! అతని నివాసం ప్రక్కనున్న పట్నం. మొదటనుంచీ రాఘవయ్యకు, రంగనాథం తండ్రికి నీటి వనరుదగ్గర తగవు వచ్చేది. అది ప్రతి ఏడాది మామూలయిపోయింది! చిన్నచిన్న పోట్లాటలవటం సర్దుకుపోయేవారు. ఇద్దరి భూమిని ఆనుకొని ఒక పిల్ల కాలువ ప్రవహిస్తోంది. దానిద్వారా వచ్చేనీరే ఈ రెండుపొలాలకు, ఇంకా ముందున్న మరికొంత భూమికి సాయపడుతుంది. ఆ కాలవ నది పొంగగానే ఒక్కసారిగావచ్చి మళ్ళీ తగ్గిపోతుంది. రెండు మూడు పూటలు మాత్రమే బాగా నీరు వస్తుంది. ఆ కాలవ మొదట రంగనాథం పొలాన్నే తాకుతుంది. న్యాయంగా ఆ నీరు మొదట రంగనాథం పొలానికే వాడాలి. కాని రాఘవయ్య ఏ రాత్రోవచ్చి రంగనాథం పొలానికి గట్లువేసి తన

పొలంలోకి మళ్ళించేవాడు. ఈ దుర్మార్గం ప్రతి ఏడాదీ సాగుతున్నదే!

ఇదే సమస్య ఈ పర్యాయం రంగనాథంతోనూ వచ్చింది. రంగనాథం ఈ అన్యాయాన్ని సహించలేక పోయాడు. దీన్ని ఆపాలి. ఏమైనా సరే ముందు తన పొలం తడవాలి. తరువాతే, మిగతావి! ఏమైన ఆ రాత్రి కాపలా కాసి గట్లగురించి జాగ్రత్త పడాలి. ఈ సమస్య గురించి ఆలోచించుకొంటూ సాయంత్రం పొలం గట్టువెంట ఇంటికి బయలుదేరాడు. పైర్లన్ని చల్లగాలికి ఉల్లాసంగా తలలూపుతున్నాయి పచ్చని ఆకులతో కలకల లాడే ఆ పైరును చూస్తూంటే మనస్సు అంతు తెలియని ఆనందంతో నిండిపోయింది. సన్నని రొద చేస్తూ కాలవలోంచి పొలంలోకి నీరు పారుతోంది. కాలవ గట్టున రెండు కొంగలు పురుగుల కోసం ధ్యానం చేస్తున్నాయ్! నడుస్తూ ఇల్లు చేరుకున్నాడు.

.....................

"నాన్నా, మనం ఈ రాత్రికి పొలంలో కాపలా కాయాలి. లేకపోతే ఆ నీరు మనకు దక్కదు ఈ రాత్రి అవసరం వస్తే జాగరణచేసి నీరు పంపాలి. మనం అప్రమత్తగా వుండాలి. మనకు ఆధారం ఆ పంట! అది జాగ్రత్తగా కాపాడుకోవాలి! ఎవరైనా గట్లు తెగ్గొడితే వాడిని అక్కడే నరికెయ్యాలి!" ఆవేశంగా అన్నాడు. తండ్రి సమాధానంగా చిరునవ్వు నవ్వేడు.

మాట్లాడకుండా చుట్టదీసి వెలిగించాడు.

గాలిలోకి పొగ విలాసంగా వదులుతూ అన్నాడు. "రాత్రి భోజనం చేసి వెళ్దాం. టార్చిలైటులో బ్యాటరీలు వెయ్యి."

భోజనంచేసి ఇద్దరూ పొలానికి బయలుదేరారు. గట్లన్ని మరొకసారి చూసకొని పొలంలోని పాకవద్దకు చేరుకున్నారు. "అబ్బాయ్! నీకు నిద్రరాగానే నన్ను లేపు" అంటూ మేను వాల్చాడు తండ్రి. తండ్రికి నిద్రపట్టగానే పాక బయటకు కర్ర చేతితో పుచ్చుకు వచ్చాడు రంగనాథం, సిగరెట్టు వెలిగించి ఇటు అటూ తిరగటం ప్రారంభించాడు.

సన్నంగా కీచురాళ్లు అరుస్తున్నాయి. ఆ అరుపులకు శ్రుతికలుపుతూ మెల్లిగా గాలివీస్తోంది, చీకటిలో పైర్లన్నీ లీలగా అగుపిస్తున్నాయి. ఏదో ఆలోచనలతో కొంతకాలం గడిపాడు. పాక వద్దకు వెళ్ళి తండ్రిని లేపి తాను నిద్రకు సిద్ధమయ్యాడు.

............

"తండ్రి కాలవగట్టుమీద కూర్చున్నాడు. ఎవరో నలుగురు బలాఢ్యులు తన తండ్రిని కర్రలతో కొడుతున్నారు. రక్తంలోపడి తన్నుకుంటున్నాడు" కెవ్వున కేకవేసి లేచిపోయాడు. పాకలో గుడ్డిదీపం వెలుగుతోంది. పీడకల! చుట్టూ కలయ జూచాడు. తండ్రి అక్కడలేడు.

గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయ్!

ఒళ్ళంతా చెమటలు పట్టింది!

మనస్సు ఏదో కీడును శంకించింది!

దూరంగా తీతువు అరుస్తోంది.

మనిషి భయంతో కంపించిపోయాడు!

ప్రక్కనేవున్న టార్చి తీసుకొని బయటకువచ్చి టార్చి వెలుతురు సాయంతో చుట్టూ కలయ జూచాడు.

ఎక్కడా జాడలేదు!

వడిగా అడుగులువేసుకుంటూ కాలవగట్టుకు చేరుకున్నాడు. కాలవలో నీళ్లు విషాదంగా రోదచేస్తున్నట్లనిపించింది.

కాలవగట్టున టార్చి కాంతిలో తండ్రి!

నేలమీద పడివున్నాడు! రక్తపు మడుగు చుట్టూ!

మనిషి నిలువునా కంపించి పోయాడు!

కాళ్ళూ చేతులు ఆడలేదు.

వడిగా వెళ్ళి కాలవలో నీళ్ళు దోసిటితో తెచ్చి తండ్రి ముఖంపై చిలకరించాడు. రెండు చేతులతో ఎత్తి మోసుకొని వచ్చి పాకలో పరుండబెట్టాడు. శక్తికూడదీసికొని ఊళ్ళోకి పరుగెత్తాడు వైద్య సహాయం కోసం!

* * *

నాలుగు రోజులు గడిచాయ్! తండ్రి పరిస్థితి రోజు రోజుకూ విషమిస్తోంది. వైద్యుడుకూడా నీరుకార్చేశాడు. తల

మీద గాయాలు బాగా తలగటంవల్ల జ్ఞాపకశక్తికూడా పూర్తిగా కోల్పోయాడు. మధ్యమధ్య కలవరింతలు తప్ప స్పృహ లేదు. రంగనాథానికి తండ్రి పరిస్థితిచూస్తే ఏమి చెయ్యాలో తోచలేదు. తండ్రి ఈ స్థితికి రావటానికి కారణం రాఘవయ్యే! రాఘవయ్యమీద పగ రేగింది! అగి తండ్రిపడే బాధతోపాటు పెరిగి ఈ నాలుగు రోజుల్లోనూ రంగనాథం హృదయంలో గూడు అల్లుకొంది. "రాఘవయ్య కుటుంబాన్ని సర్వనాశనం చెయ్యాలి" అనుకున్నాడు. కాని తండ్రిని వదలి వెళ్ళలేక పోయాడు.

ఐదవరోజు తండి ప్రాణం అనంతంలో కలిసిపోయింది. తండ్రి శవంవద్ద పడి భోరున ఏడ్చాడు! తల నేలకేసి బాదుకున్నాడు. జుత్తుపీక్కున్నాడు! పిచ్చెత్తినట్లయింది.

లోకమంతా శూన్యంగా అగుపించింది.

తను నిస్సహాయుడయ్యాడు!

లోకంలో తనను ఎక్కువగానే ప్రేమించే తండ్రి!

తనను అభిమానించి ఇరవైరెండేళ్లు సర్వస్వం అయిపించిన తండ్రి.

తన సుఖంకోసం ఇరవైనాల్గుగంటలూ పాటుపడిన తండ్రి!

"మట్టిలో కలిసి పోయాడు. తనకుగాకుండాపోయాడు! లోకానికి ఇక లేడు!

"అంత నిర్మలమూర్తిని తను మరి చూడగలుగుతాడా! ఊహుఁ। దుర్లభం" అనుకున్నాడు.

దీని కంతకి మూలం రాఘవయ్య. యాభయ్యేళ్లు నిండినా మిసమిసలాడే కండలతో, మెలితిప్పిన మీసాలతో పరిపూర్ణ ఆరోగ్యంతోవున్న తన తండ్రిని పొట్టబెట్టుకున్నాడు.

రాఘవయ్య తలపుకు రాగానే హృదయం భగ్గుమంది!

శరీరంలోని ప్రతి అణువూ ప్రతీకార వాంఛను రెచ్చగొట్టాయి!

ప్రతి రక్తబిందువూ పగదీర్చుకొమ్మని ఉసికొల్పింది.

అంతరాత్మ ఫక్కున నవ్వి హేళనచేసింది.

ఆ హేళన తనలోని పిరికితనాన్ని వ్యక్తంచేసి తనకు పౌరుషాన్ని కల్గించింది!

పగ, క్రోధం మనసులో పెరిగాయి.

*   *   *   *

రంగనాథం నడుస్తున్నాడు! కటిక చీకటి. రోడ్డు ప్రక్కనున్న చెట్లు ఆవులించిన భూతాల్లా వున్నాయి. భయంకర నిశీధిలో నిశ్శబ్దం విలయతాండవం చేస్తోంది!

రంగనాథం నడుస్తున్నాడు!...

ఆ నడకలో వేగంవుంది! అతడు స్వతహాగా పిరికివాడే అయినా మనసులో గూడుకట్టుకున్న పగ, ప్రతీకారవాంఛ

అతనికి వింత ధైర్యాన్ని చేకూర్చాయి. తను చెయ్యబోయే పని ఎంత భయంకరమైనదో, కష్టమైనదో తెలుసు! కాని ఆ పని పూర్తిచెయ్యకపోతే తనకు శాంతి లభించదు. జీవితమంతా ఆ క్రోధం, పగ మనసును దహించివేస్తాయి. రాఘవయ్య కుటుంబాన్ని సర్వనాశనం చేస్తానని తండ్రి శవందగ్గర ఘోర ప్రతిజ్ఞ చేశాడు. చనిపోయిన తండ్రి గుండెలమీద చెయ్యివేసి మరీ చెప్పాడు. ఈపని పూర్తిచెయ్యకపోతే తండ్రి ఆత్మకు శాంతి లభించదు.

రంగనాథం నడుస్తున్నాడు!...

పని పూర్తవుతుందనే ఉత్సాహంతోను, తన ప్రతిజ్ఞ నిలబెట్టుకోవాలనే పట్టుదలతోను నడుస్తున్నాడు. మరొకసారి తన ఆకారమంతా ఆ చీకట్లో తడిమి చూసుకున్నాడు. దట్టమైన గడ్డం చేతికి తగిలింది. ఒడలంతా కప్పేసిన రైన్‌కోటు ఎప్పుడో తాతలనాటిది ఇంటిలో వుంది! చేతిసంచిలో రెండు కత్తులు, గ్లోవ్స్ ఒక జత, అన్నీ భద్రంగానే వున్నాయ్ అనుకున్నాడు. కత్తులు సంచీలో వుంచటం భద్రంకాదని చుట్టూ కలయజూచి మొలలో దోపాడు! ఒకసారి గట్టిగా ఊపిరి పీల్చాడు.

రంగనాథం నడుస్తున్నాడు!...

వీధులన్నీ తిరిగి చివరకు తనకు కావలసిన వీధికే వచ్చాడు. విద్యుచ్ఛక్తి పోయినట్లయింది. కిరసనాయిలు దీపాలు వెలిగించి వున్నాయి వీధిలో! అవికూడా తనకు

సహాయంకోసమే అన్నట్లు ఆఖరి వెలుగు వెలుగుతూ అంతిమావస్థలో వున్నాయి.

రంగనాథం నడుస్తున్నాడు!...

నడిచి ఒక యింటిముందుకు వచ్చి ఆగిపోయాడు. ఆ యింటికెదురుగా ఒక కిళ్ళీకొట్టు! ఆ బడ్డీముందు బల్లమీద ఒక ఆసామీ పండుకొని నిద్రపోతున్నాడు గురకలుతీస్తూ. బహుశః అతడు ఆ కొట్టు యజమాని అయివుంటాడు. ముందు వైపునుంచి ఇంటిలోకి ప్రవేశించటం చాలా కష్టం! క్షేమం కూడా కాదు! ఇంటిప్రక్క చిన్న సందువుంది. ఆ సందు గుండా ప్రవేశించి ఇంటి వెనుకభాగం చేరుకున్నాడు. గోడ చిన్నదే! ఎక్కి దుమికి పెరట్లోకి వెళ్ళాడు. అక్కడనుంచి లోపలికి వెళ్ళటం సాధ్యమైన పనికాదు!

పెరడంతా కలయజూశాడు! తన కోసమే అన్నట్లు పొడుగాటి నిచ్చెన కన్పించింది. దేవుడికి మనస్సులోనే వేయి నమస్కారాలు చేశాడు. నిచ్చెన సాయంతో మేడమీదకు చేరుకున్నాడు. బహుశః ఇక్కడే వుండవచ్చు అనుకున్నాడు. వసారా నడిచి గది చేరుకొని గది తలుపులు మెల్లిగా తోశాడు. గదిలో చిన్న వెలుగు! ఒక మంచం మీద రాఘవయ్య! ప్రక్కమంచంమీద భార్య కాబోలు! భార్య ప్రక్కలో పసిబిడ్డ! గ్లోవ్స్ తీసి జాగ్రత్తగా తగిలించుకున్నాడు. జేబులో భద్రపరిచిన సీసా తీసి చప్పుడుకాకుండా

లోపలికి ప్రవేశించి వాసన చూపించాడు. ఇద్దరికీస్పృహ తప్పింది!

ఎదురుగా టేబుల్ పైని తథాగతుడి విగ్రహం! అక్కడ చిన్న బల్బువెలుగుతోంది! ఆ వెలుగుతో భగవానుడు తన సందేశాలను ప్రసరింపజేస్తున్నాడు. అర్ధనిమీలితమైన ఆయన నేత్రాలు శాంతిని అహింసను చూస్తున్నాయ్! తనలోని పగను ద్వేషాన్ని చల్లారుస్తున్నాయ్! ఆ విగ్రహాన్ని చూస్తూ అలా ఉండిపోయాడు. ఆయన ముఖంలోని కాంతి, తేజస్సు తనను తెలియని లోకానికి తీసుకుపోతోంది.

వెంటనే రంగనాథం ముఖం త్రిప్పేసుకున్నాడు.

అటువైపుచూస్తూ తాను చెయ్యబోయే పని చెయ్య లేదు.

గుండెదిటవు చేసుకున్నాడు!

తన ప్రతిజ్ఞను జ్ఞప్తికి తెచ్చుకున్నాడు!

అంతే! ఒకటి... రెండు!...

ఒక్క నిమిషంలో రెండు ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి.

ఇక మిగిలింది పసికూన!

చూస్తూ చేతులారా కత్తిని ఆపసిపాప కడుపులోకి దింప లేక పోయాడు.

సంతోషం, శాంతి, ఈలోకపు పాపాలు ఇంకా ఏమీ తెలియని పసికందు.

కుటిలత్వం, స్వార్థం, అధర్మం తెలియని వయస్సు!

ఆ పసిపాప తనకు చేసిన అపకారం ఏమిటి?

"ఊహూ! ఇలా ఆలోచిస్తువుంటే లాభంలేదు! ఆ పసి కూనను కూడా ఉండనివ్వకూడదు! కాని చంపవలసిన విధానం ఇది కాదు!" అనుకున్నాడు మనస్సులో.

ఇక జాగుచేయకూడదు!

ఆ బిడ్డని భుజంమీద వేసుకొని వడిగా రోడ్డు చేరుకొని నడక ప్రారంభించాడు స్టేషన్ వైపు.

............

అప్పుడే రైలు స్టేషను వదిలేస్తోంది. గబగబా పరుగెత్తి రైలును అందుకున్నాడు. తన అదృష్టాన్ని అభినందించుకో లేకుండా వుండలేక పోయాడు! రైల్లో దీపాలు గుడ్డిగా వెలుగు తున్నాయి. కంపార్టుమెంటులో చాలామంది నిద్రలో మునిగి పోయివున్నారు. ఎవరో ఒక ముసలావిడ మాత్రం రైల్లోంచి పైకిచూస్తూ కూర్చుంది.

ద్వారంవద్దే ఒక వారగా నిలబడ్డాడు.

భుజంమీద పిల్లాడు కెవ్వుమని ఏడుపు ప్రారంభిం చాడు!

రంగనాథం గొంతులో వెలక్కాయ పడ్డట్లయింది.

ఊరుకో పెట్టడానికి శతవిధాల ప్రయత్నించి విఫలు డయ్యాడు.

ముసలామె ఇటువైపు తిరిగి అంది "పాపం! ఆకలవుతుందేమో! తల్లేదీ!

సరిగ్గా మాట్లాడలేక పోయాడు.

గుండెదిటవు చేసుకొని అన్నాడు. "తల్లి ఇంటివద్ద ఉంది! సాయంత్రం ఈ వూరు హాస్పిటలుకు తీసుకొనివచ్చాను ఇప్పటివరకూ బండీ లేక ఉండిపోవలసి వచ్చింది!"

అంత సరిగా అబద్ధం ఆడగలిగినందుకు తనను తానే మెచ్చుకున్నాడు.

"ఇలా ఇయ్యి నాయనా! నేను ఊరుకోబెడతాను."

తీసికెళ్ళి ఆమె చేతికిచ్చాడు!

ఆమె లాలింపుతో పిల్లాడు ఏడుపు మానాడు.

"కొంచెం ప్రక్క స్టేషన్ వరకూ ఉంచమ్మా! స్టేషను రాగానే దిగిపోతాను!" అన్నాడు. రంగనాథం కృతజ్ఞతా భావం సూచించే కళ్ళతో.

"అలాగే నాయనా!" అందామె.

ద్వారం వద్దకువచ్చి ఊచలుపట్టుకొని పైకి చీకటిలోకి చూస్తూ నిల్చుండి పోయాడు?

ఎందుకో తెలియకుండానే గుండెలు వేగంగా కొట్టుకోవడం ప్రారంభించాయి.

ఒళ్ళంతా చెమటలు పట్టింది.

గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నట్లు ఫీలయ్యాడు!

కాళ్ళక్రిందనుంచి దడ ప్రారంభమయింది!

"తాను పట్టుపడితే?"

సమాధానం ఊహించలేనంత దుర్భరమైనది. రెండు ప్రాణాలు తీసినందుకు శిక్ష ఏమిటి?

ఎదురుగా ఉరి త్రాడు! తనను ఆహ్వానిస్తోంది!

కళకళలాడే భార్య ముఖంపై కుంకుమ చెదిరిపోతుంది!

ఆమె బ్రతుకు కళావిహీనమవుతుంది!

ఎదురుగా వికటాట్టహాసం చేస్తూ పసిబిడ్డ!

నా తండ్రి తల్లిని నాకు దూరం చేశావు కదూ! నీకు తగిన శిక్ష నేను విధిస్తాను" అన్నట్టుంది ఆ నవ్వు.

రెండు చేతులతో మెడను పిసికేస్తున్నట్లుంది ఆ నవ్వు!

గొడ్డళ్ళతో నెత్తిమీద మోదుతున్నట్లుంది ఆ నవ్వు!

గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. లోకమంతా ఏకమై గిరిగిరా తిరుగుతున్నట్లనిపించింది.

పెద్ద ఘోషతో చెవులు మూసుకుపోతున్నట్లని పించాయ్!

రైలు కుదుపుతో ఈ లోకంలో పడ్డాడు.

తను దిగవలసిన స్టేషన్ వచ్చేసింది. గబగబా ఆ ముసలామె వద్దకు వెళ్ళి పసిబిడ్డను పుచ్చుకొని రైలు దిగి పోయాడు.

భుజాన్న బిడ్డను వేసుకొని వడిగా ఇంటివైపున నడవ సాగాడు.

దారిలో వంతెనపైనుంచి ఈ బిడ్డను క్రిందకు పారవేస్తే మంచి ఆలోచన వచ్చింది. తన గ్రామం ఇదే కనుక బిడ్డశవం వంతెనక్రింద దొరికితే తనను అనుమానించే అవకాశం వుంది.

ఆ ఆలోచనకు స్వస్తిచెప్పాడు.

వంతెన దగ్గరవుతోంది!

వంతెన గట్టుమీద ఎవరో కూర్చుని సిగరెట్టు కాలుస్తున్నట్లున్నారు!

తను రోడ్డుమీదనుంచి వెళ్ళటం ప్రమాదకరం!

వెంటనే రోడ్డు దిగి అడ్డదారి పట్టాడు.

ఇల్లు చేరుకున్నాడు! అప్పుడు జ్ఞాపకం వచ్చింది. పిల్లాడి సంగతి. భార్యతో నిన్నరాత్రి ఒక స్నేహితుని ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరాడు. "ఈ కుర్రాడు ఎవరని ప్రశ్నిస్తే?" ఏమని సమాధానం చెప్పటం. సరిగా చెప్తేనేకాని వదలదు. అసలే పట్టుదల గల స్వభావం!

"పోనీ, భార్యకు నిజం చెప్పేస్తే?"

"ఇంకేమైనా వుందా! ఆడదాని నోట్లో నువ్వుగింజ కూడా నానదన్నారు!"

అంతరాత్మ ప్రబోధించింది.

"ఈ దారుణకాండబయట పడితే మెడకు ఉరితాడే"

మెల్లిగా తలుపు తట్టాడు.

భార్యలేచి నిద్రకళ్ళతో తలుపు తోసింది.

గాభరాగా లోనికి ప్రవేశించాడు.

తలుపు గడియ వేస్తూ ఆశ్చర్యంగా ప్రశ్నించింది భార్య.
ఈ పిల్లాడెవరండీ"

"ఈ కుర్రాడా!... ఈ కుర్రాడు దారి ప్రక్కన దొరికాడు!" గబగబా చెప్పేశాడు.

"అదేమిటి అలా వున్నారు! అసలేం జరిగింది?"

ఆవులిస్తే పేగులు లెఖ్ఖపెడుతుంది భార్య.

"అబ్బే! ఏమీ లేదు! స్నేహితుని వద్ద పని ఇప్పటికిగాని అవలేదు! అక్కడనుండి వచ్చేస్తూవుంటే రోడ్డుప్రక్క తుప్పల్లో ఏడుపు వినిపించింది. చూస్తే ఈ కుర్రాడు! ఎవరో వదిలేసినట్లున్నారు. తీసుకొచ్చాను" చూస్తువదిలెయ్యలేక మన ఇంటిదగ్గరకొచ్చాక పెద్ద పాము కాళ్ళక్రింద పడింది.

"గాభరాగా వచ్చేశాను. ఇంకా నయం! కాటెయ్యలేదు!"

వగర్చుకుంటూ సమాధానం చెప్పాడు.

మనకు బిడ్డలు లేకపోవటం వలన దేవుడే మనకు ప్రసాదించాడండీ!

అబ్బ చూడండి కుర్రాడెంత బాగున్నాడో! మనం పెంచుకుందాం!

గుండెల్లో రాయిపడింది!

"ఆ కుర్రాణ్ణి పెంచటమా! అంటే పాముపిల్లకి పాలు

పోసి పెంచినట్లన్న మాట! ఈ దుష్టశక్తి తన ఇంట్లో పెరగడమా! తన ప్రాణం తియ్యదూ!"

"ఆ పిల్లాణ్ని పెంచుకుంటావా! అలా జరగటానికి వీల్లేదు!" గట్టిగా అరిచాడు.

"అదేమిటండీ! అలా అరుస్తారు! లేకపోతే అదృష్టం కొద్దీ దొరికిన పిల్లాణ్ని పారేస్తామా! మీరేవిడ్డూరంగా మాట్లాడతారేం!" విసుగుదల ప్రదర్శించింది.

"భార్య మాటలు వింటూవుంటే కుర్రాణ్ణి వదిలేట్టు లేదు. ఏమిచెయ్యటమా?" అని ఆలోచనలో పడిపోయాడు.

భార్య పిల్లవాడిని లాలిస్తూ ముద్దాడుతోంది. తన ఉనికినే మరచినట్లు. "పాపం! ఎవరి పిల్లడో! రేపు తీసుకుపోయి అనాధశరణాలయానికి అప్పగిస్తే సరి. తల్లిదండ్రులు ఎంత బాధపడుతున్నారో" సానుభూతి పూర్వకంగా ఇంకో ప్రయత్నాన్ని బయట పెట్టాడు. భార్య తోకతొక్కిన త్రాసులా లేచింది.

"అదేమిటండీ! అనాధ శరణాలయానికి అప్పగిస్తారా! లేకలేక మనకు అదృష్టం కలిగిందండీ! నేను మాత్రం బాబును వదలను" ఇక మాట్లాడి లాభం లేదనుకున్నాడు.

తన భార్య పట్టువదలదు. గత్యంతరం లేదు. "చూద్దాంలే" అన్నాడు విసుగ్గా!

అప్పటికే కొంచెంకొంచెం తెల్లవారుతోంది. సన్నని వెల్తురు లోకంలోకి చొచ్చుకొని వస్తోంది. మంచం కూడ

వాళ్ళాడన్న మాటేగాని అప్పుడు నిద్రరాలేదు రంగనాథానికి. తను రాత్రి చేసినపని కళ్ళఎదుటవచ్చి భయపెడుతోంది. మనస్సంతా అల్లకల్లోలంగా తయారయింది. ఏదో భయం ఏదో భయంకర పిశాచం మనసును ఆవేశించినట్లయింది. పట్టుబడుతే ఉరితీస్తారేమోనన్న భయం పురివిప్పి నాట్యం చేసింది. ఒళ్ళంతా తేమ్మ, జెర్రులు ప్రాకుతున్నట్టుంది! పిచ్చెత్తినట్లు ఇటుఅటూ దొర్లాడు మంచంమీద. ఊహుఁ నిద్రరాలేదు. మంచం దిగి వరండాలోకి వచ్చాడు. ప్రేమగా లాలింపుతో పాలుపడుతోంది ఆ పసిపాపను.

అటువైపు చూడలేకపోయాడు! వీధిలోకి వచ్చి సిగరెట్టు వెలిగించి పొగవదుల్తూ ఇటుఅటు తిరుగాడసాగాడు. మస్తిష్కం అనేక ఆలోచనలతో వేడెక్కిపోయింది. అలాగే తెల్లవారింది!

గతమంతా ఒక్కసారి బుర్రలో కన్పించి మాయమైంది! తాను ఎవరినైతే నాశనం చేద్దామనుకున్నాడో వాడే తన బిడ్డగా, శేఖరంగా అప్యాయంగా, పెరగాడు భార్య సంరక్షణలో! ఎంత మనస్సును ఆకట్టుకుందామనుకున్నా పెంచిన మోహం అడ్డువచ్చేది! తండ్రివద్ద ప్రతిజ్ఞ కోసం శేఖరాన్ని ఎలాగైనా దూరానికి పంపాలనుకున్నాడు! ఫలితం! మంకు రాయిచేసుకొని భార్య యెంత చెప్పినా వినక శేఖరాన్ని యుద్ధానికి పంపాడు.

కాని శేఖరం తనను దూరమైన మర్నాటినుండీ మనసు

ఏదో క్షోభతో నిండిపోయింది! ఎంత శత్రువు కొడుకైనా తన సంరక్షణలోనే పూర్తిగా పెరిగి పెద్దవాడయ్యాడు! ఇంతకీ రాఘవయ్య తనకు అపకారం చేశాడు. కానీ ఈ శేఖరం అప్పటికి పసికూన! తనకు ఏ అపకారం చెయ్యలేదు! మరి ఎందుకు ఇంతకాలం తను కక్ష పెంచుకున్నట్టు?

శేఖరం వ్రాసే ఒక్కొక్క ఉత్తరం చదువుతూ వుంటే మనసు కరిగిపోతుంది! అతడు పడే కష్టాలు చదువుతూ వుంటే మనసు తూట్లుపొడుస్తున్నట్లనిపిస్తుంది. ఆ ఉత్తరాలు చదువుతూవుంటే ఎనలేని వాత్సల్యం పొంగి పొరలుతున్నట్టు అనిపిస్తుంది.

భార్య సంరక్షణలో ఎంతో గారాబంగా పెరిగి అక్కడ అన్ని కష్టాలకు ఎలా ఓరుస్తున్నాడో!

దేశసేవ అని మాత్రం మనసును పూర్తిగా తృప్తి పరచుకున్నాడు! కాని ఈ మూడునెలలు తిరిగేసరికి మనసు శేఖరాన్ని చూడకుండా ఉండలేకపోయింది.

సాధ్యమైనంత త్వరలో బయలుదేరి రమ్మని వ్రాశాడు!

దానికి జవాబు వచ్చింది. 8 వ తారీఖున వస్తున్నట్లు. ఉత్తరం రాగానే ఉత్సాహంతో భార్యకు ఈ విషయం తెలియజేశాడు! ఆమె ఆనందం చెప్పనలవికాదు! భర్త దారిలోకి వచ్చినందుకు ఆమె మనస్సు ఎంతో తేలికపడింది.

8 వ తారీఖు ఉదయం. ఉత్సాహంగా ఎంతో ఆత్రు

తగా శేఖరం రాక కోసం ఎదురుచూస్తున్నాడు రంగనాథం! విలాసంగా చుట్టకాలుస్తూ పొగ వదులుతున్నాడు గాలిలోకి!

“టెలిగ్రాం” అంటూ పోస్టుమెన్ ప్రవేశించాడు!

సంతకంచేసి ఆత్రుతగా కవరు చింపాడు.

“శేఖరం గస్తీకి వెళ్ళి తిరిగిరాలేదని చనిపోయినట్లు విశ్వసిస్తున్నామని” సైనిక ఆఫీసరునుండి టెలిగ్రాం !

కుప్పలా కూలిపోయాడు! అంతే! ఆఖరి శ్వాసతో అనంతంలో లీనమయ్యాడు. చేతిలోని టెలిగ్రాం గాలికెగిరి దూరంగా పోయింది.

డాక్టర్ చావుకు కారణం చెప్పలేకపోయాడు!

ప్రమాదం తప్పించుకొని తండ్రిని చూడాలన్న ఉత్సాహంతో వస్తున్న శేఖరం మాత్రం తండి చావుకు కారణం ఏమి చెప్పగలడు: